ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
కర్ణాటక వార్తలు
గురువారం 14 ఆగస్టు 2025



రాజణ్ణకు మద్దతుగా తుమకూరులో నిరసన

బెంగళూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాజణ్ణను మంత్రి పదవి నుంచి తొలగించినందుకు ఆయన అభిమానులు ఆక్రోశం వ్యక్తం చేశారు. తుమకూరులో బుధవారం పెద్ద ఎత్తున చేరిన ఆయన అభిమానులతోపాటు వాల్మీకి సామాజికవర్గానికి చెందినవారు ఆందోళన చేశారు. తుమకూరు ఎంజీ రోడ్డులో భారీ ర్యాలీ జరిపారు. ఇదే సమయంలో ఆయన అభిమానులు కొందరు అర్ధనగ్నంగా ఊరేగారు. 10 తాలూకాల నుంచి 60 బస్సులకుపైగా అభిమానులు వచ్చి నిరసనలో పాల్గొన్నారు. రాజణ్ణను మళ్లీ మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధుగిరిలో అభిమానులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు.

ప్రాభవం కోల్పోతున్న బెంగేరి ఖాదీ సంస్థ..!

- జాతీయ పతాకాల తయారీలో దేశంలోనే ఏకైక కేంద్రం
- సిబ్బందికి జీతాలు ఇవ్వలేని దుస్థితి
- పాలిస్టర్ రాకతో కొనేవారు కరువు

బెంగళూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జరుపుకొనే రెండు జాతీయ పండుగలతోపాటు ప్రతి కార్యాలయంలో జాతీయ పతాకాన్ని గౌరవించే సంప్రదాయం ప్రతి భారతీయుడు గర్వంగా భావిస్తాడు. జాతీయపతాకం అంటే ఎనలేని గౌరవం, అభిమానం చూపుతాం. ఇలా దేశమంతటికీ జాతీయ పతాకాలు అందించిన ఏకైక ఖాదీ గ్రామోద్యోగ సంస్థ నష్టాలతో కొట్టుమిట్టాడుతోంది. హుబ్బళ్ళికి అనుబంధంగా ఉండే బెంగేరి ఖాదీ గ్రామోద్యోగ సంస్థ దేశంలో జాతీయ పతాకాలు తయారు చేసే ఏకైక కేంద్రంగా ఏడు దశాబ్దాలుగా కొనసాగుతోంది. సాంకేతికంగా వచ్చిన మార్పులు, ఇతర వస్త్రాలతో జాతీయ పతాకాల తయారీ వంటి కారణాలతో సంస్థ ఆర్థికంగా చతికిలబడింది. ఇక్కడ నైపుణ్యం అనుభవం కల్గి ఏళ్ల తరబడి ఇదే జీవనాధారంగా నమ్ముకున్న కార్మికులకు ఉపాధి కష్టమవుతోంది. ఈ ఏడాది కేవలం 50 లక్షల రూపాయల విలువైన పతాకాలు మాత్రమే విక్రయించారు. గోడౌన్‌లలో కోటిన్నర విలువ చేసే సరుకు మగ్గిపోతోంది. స్వాతంత్ర్య వేడుకలంటే ఇక్కడి కార్మికులకు చేతినిండా పని ఉండేది. ప్రస్తుతం చేతి సంచుల తయారీలో నిమగ్నమయ్యారు.

● దేశమే గర్వపడేలాంటి పవిత్ర ఉద్యోగంగా జాతీయ పతాకాల తయారీని కార్మికులు భావించారు. బెంగేరిలో కొన్నేళ్లకాలంగా పనిచేసి మేం జాతీయ పతాకాలు చేసే సంస్థలో ఉన్నామని గర్వంగా చెప్పుకొనేవారు. ఈ ఏడాది ఆగస్టు లో కూడా జెండాల తయారీకి ఆర్డర్లు లేకపోవడంతో కార్మికులకు వేతనం ఇవ్వడం కష్టతరంగా మారుతోందని తయారీ కేంద్రం కార్యదర్శి శివానంద మఠపతి విచారం వ్యక్తం చేశారు. కొంతమంది కార్మికులు మాకు జీతం కంటే జాతీయజెండా తయారు చేయడమే సంతృప్తినిస్తుందని అంటున్నారు.



బెంగేరిలోని ఖాదీ గ్రామోద్యోగ కేంద్రం

పాలిస్టర్ రాకతో తగ్గిన డిమాండ్

2022లో కేంద్రప్రభుత్వం పతాకాల తయారీకి సంబంధించి సవరణలు చేయడంతో ఖాదీ జాతీయ పతాకాన్ని అడిగేవారు లేకుండాపోయారు. స్వాతంత్ర్య అమృత మహోత్సవం జరుపుకొంటున్న తరుణంలో హర్ ఘర్ తిరంగా చైతన్యాన్ని ప్రారంభించిన సందర్భంలో ఫ్యాక్టరీలో తయారు చేసిన పాలిస్టర్ పతాకాన్ని ఎగురవేయవచ్చునని ప్రకటించారు. దీంతో తక్కువ మొత్తంలోనే జాతీయ పతాకం లభిస్తుందని ఎక్కువమంది ఆసక్తి చూపారు. ఇలా ఖాదీ జాతీయ పతాకాలకు డిమాండ్ తగ్గేందుకు ప్రధాన కారణమైంది. ఈ ఏడాది 3.50 కోట్ల విలువైన జాతీయ పతాకాలు విక్రయం అవుతాయని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే విక్రయాలు సాధ్యం కాలేదు. 2022లో 4.50 కోట్ల రూపాయల విలువైన పతాకాలు విక్రయించారు. ఆ తర్వాత వరుసగా రెండేళ్ల వ్యాపార లావాదేవీలు తగ్గుముఖం పడుతూ వచ్చాయి.

పతాకాల తయారీలో 80మంది కార్మికులు

బెంగేరీ సంస్థలో 80మంది కార్మిక ఉద్యోగులుగా ఉన్నారు. వీరంతా మహిళలు కావడం విశేషం. బెంగేరి పతాకం కోసం అవసరమైన బట్టను బాగల్కోటె ఖాదీ గ్రామోద్యోగ సంస్థ సమకూర్చేది. అక్కడ 600మంది కార్మికులు ఉన్నారు. జాతీయ పతాకాల విక్రయం జరిగితేనే బెంగేరి సంస్థతోపాటు బాగల్కోటె ఖాదీ గ్రామోద్యోగ సంస్థలో పనిచేసే 600మందికి ఉపాధి లభిస్తుంది. ప్రస్తుతం పతాకాల విక్రయం తగ్గుముఖం పట్టడంతో బెంగేరిలో పనిచేసే 80మందితో పాటు బాగల్కోటెలో పనిచేసే 600మంది నిరుద్యోగులుగా మారుతున్నారు. బెంగేరి సంస్థలో ఇతర ఖాదీ ఉత్పత్తుల విక్రయం కూడా తగ్గుముఖం పట్టింది. బెంగేరి జాతీయ పతాకం తయారీ విభాగంలో చేతివృత్తుల నిపుణులు, కేవీఐసీ, బీఐసీ సూచించిన మార్గదర్శకాలను పాటించి పతాకాన్ని తయారు చేస్తారు. వీటి నాణ్యత బాగున్నందునే కాస్త ధర ఎక్కువగా ఉంటుంది. చేతితో సిద్ధం చేసిన నూలుదూరాన్ని చేతిమగ్గాలలో నేసిన బట్టతోనే ఖాదీ, పట్టు, ఉలెన్ ఏదైనా పతాకాన్ని తయారు చేయవచ్చు ననేది ఇప్పటివరకు ఉన్న విధానం. ఈ నిబంధనలకు సవరణలు చేయడంతో జాతీయ పతాకం తయారీకి ఒక ఏడాదికి మాత్రమే వెసులుబాటు కల్పించారు. కానీ సవరణలు చేసిన విధానాలు కొనసాగించడంతో సమస్య నెలకొంది. బెంగేరి జాతీయ పతాకం తయారీ సంస్థలో ఇక్కడ కార్మికులకు పనిలేకుండా పోయింది. సిబ్బంది పతాకాలకు బదులుగా చేతి సంచులను కుడుతున్నారు. ఈ బ్యాగులు కూడా మార్కెట్‌లో విక్రయం కావడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే కేంద్రాన్ని మూసివేయక తప్పదని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

● జాతీయ పతాకానికి ఉన్న నిబంధనల సవరణలను ఉపసంహరించుకోవాలని, ఇంటింటా ఎటువంటి పతాకాలను ఎగురవేసుకోవచ్చు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఖాదీ జాతీయ పతాకాలను ఉపయోగించాలనేది మా ఆశయమని తయారీకేంద్రం కార్యదర్శి శివానంద మఠపతి అన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఉన్న కేవీఐసీ ఖాదీ భవనాలకు రూ.5కోట్ల విలువైన పతాకాలను సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నామని, అయితే ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు.



సిద్ధమవుతున్న పతాకాలు




శాసనసభలో ప్రసంగిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

అవినీతిపై.. అట్టుడికిన అసెంబ్లీ


బెంగళూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అవినీతి అంశం ప్రస్తావనతో అసెంబ్లీ అట్టుడికింది. డీసీఎం డీకే శివకుమార్, మాజీ డీసీఎం అశ్వత్థనారాయణల మధ్య తీవ్రస్థాయిలో మాటలయుద్ధం సాగింది. బుధవారం శాసనసభ కలాపాల వేళ సాయంత్రం డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ బీజేపీవారు చెప్పేదంతా అబద్ధమే అన్నారు. ఇదే సందర్భంలో మీకు కేటాయించిన శాఖ నిభాయించడంలో విఫలమయ్యారని, మీరు అసమర్థులని అశ్వత్థనారాయణ జోక్యం చేసుకున్నారు. దీంతో డీసీఎం విరుచుకుపడ్డారు. నువ్వు అసమర్థుడవని, మీ పార్టీ అబద్ధాల పార్టీ అని, అందుకే ప్రతిపక్షంలో కూర్చున్నావన్నారు. ఒకానొకదశలో నువ్వానేనా అనేస్థాయికి వెళ్లింది. ఎవరు ఎలా సంపదను లూటీ చేశారో, ఎవరికెన్ని ఆస్తులు ఉన్నాయో రాష్ట్రమంతా తెలుసని అశ్వత్థనారాయణ మండిపడ్డారు. ఇలా వాగ్వాదం తారస్థాయికి చేరడంతో స్పీకర్ యూటీ ఖాదర్ జోక్యం చేసుకుని సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. సాధ్యం కాకపోవడంతో సభను కాసేపు వాయిదా వేశారు. అంతకుముందు శాసనసభలో పలు బిల్లులకు ఆమోదం తెలిపారు. భూసవరణ చట్టంతో అన్నివర్గాలకు అనుకూలం చేశామని రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ అభిప్రాయపడ్డారు. సాధారణంగా చిన్న పరిశ్రమలు, విద్యాసంస్థల ఏర్పాటుకు 2-4 హెక్టార్లదాకా అనుమతులు తీసునేందుకు జిల్లా అధికారికే అవకాశం ఇచ్చామన్నారు. ప్రతి అనుమతికి రాష్ట్రస్థాయికి వస్తే తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. ఎంఎస్ఎంఈలు 2 ఎకరాల వరకు అనుమతి ఇచ్చామన్నారు. సోలార్, విండ్‌పవర్‌ల అనుమతుల పేరిట జాప్యం చేయకూడదని నిర్ణయం తీసుకున్నామన్నారు. పెట్టుబడులు ఆకర్షించే దిశగా ఆటో కన్వర్షేషన్‌కు అవకాశం కల్పించామన్నారు. దళారుల బెడద తీవ్రమైనందునే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.



బీజేపీ సభ్యుడు విజయేంద్ర



స్పీకర్ యూటీ ఖాదర్



బదులిస్తున్న మంత్రి కృష్ణబైరేగౌడ

వీధికుక్కల నియంత్రణపై ప్రతిపక్షాల ఆగ్రహం

రాష్ట్రంలో వీధికుక్కలు పెరిగాయని తరచూ కుక్కకాట్లతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, విధానసౌధ, శాసకరభవన్‌లోనూ వీధికుక్కల ధాటి పెరిగిందని బీజేపీ సభ్యులు ఉమానాథకోట్యాన్, సురేశ్‌కుమార్ ప్రస్తావించారు. ఆరు నెలల్లో 18వేల మంది కుక్కకాట్లతో ఇబ్బంది పడ్డారన్నారు. 18మంది రేబిస్ బారినపడ్డారన్నారు. ప్రజారోగ్యం విషయంలో తీవ్రంగా పరిగణించాలని డిమాండ్ చేశారు. జేడీఎస్ సభ్యులు సురేశ్‌బాబు జోక్యం చేసుకుని వీధికుక్కల నియంత్రణకు అన్ని పురసభలకు సూచించాలన్నారు. సురేశ్‌కుమార్ మరోసారి మాట్లాడుతూ సుప్రీం కోర్టు మార్గదర్శకాలను కేవలం ఢిల్లీకే పరిమితం చేయకుండా దేశమంతటా విస్తరింపచేయాలన్నారు.

బాలికలు, మహిళల రక్షణకు అక్క టాస్క్‌ఫోర్స్

బాలికలు, మహిళల రక్షణకోసం అక్క టాస్క్‌ఫోర్స్‌ను త్వరలోనే ఏర్పాటు చేస్తామని మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ అన్నారు. బీదర్ జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేయగా విజయవంతమైందని, 15న శుక్రవారం బెళగావి, మైసూరు, మంగళూరులలో ప్రారంభిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఐదేళ్లలో 60వేల మంది మృతి

విధానపరిషత్‌లో బీజేపీ సభ్యుడు నవీన్ అడిగిన ప్రశ్నకు రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి వివరణ ఇచ్చారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో 2.13 లక్షల ప్రమాదాలు జరిగాయని, ఇందులో 60,115మంది మృతి చెందారన్నారు. వీరిలో ఎక్కువమంది 36-40ఏళ్లలోపువారేనన్నారు. ప్రతిరోజూ రాష్ట్రంలో 130-135 ప్రమాదాలు జరుగుతున్నాయనన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు వాహనాలు నడిపేవారు జాగ్రత్తలు పాటించాలన్నారు. దేశంలోనే అత్యధిక ప్రమాదాలు జరిగే నగరంగా బెంగళూరు నిలిచిందన్నారు. రోజూ సరాసరి 136 ప్రమాదాలు జరుగుతాయన్నారు. సగటున 36-40మంది దాకా మృతి చెందుతున్నారన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, మద్యం సేవించడం వంటి ప్రధాన కారణాలుగా ఉన్నాయన్నారు.

17న ధర్మస్థళకు బీజేపీ ఎమ్మెల్యేలు

- పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర



బెంగళూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళ పవిత్రతకు భంగం కలిగించేలా కుట్ర సాగుతోందని 17వ తేదీన బీజేపీ ఎమ్మెల్యేలంతా ధర్మస్థళను సందర్శిస్తామని పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర తెలిపారు. బుధవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ మేం బీజేపీ కార్యకర్తలుగా వెళ్లడం లేదని, మంజనాథేశ్వర భక్తులుగా ధర్మస్థళకు వెళ్తున్నామన్నారు. పార్టీ సీనియర్ నేతలు, పరిషత్ సభ్యులతో కలసి వెళ్తామన్నారు. ధర్మస్థళ దుష్ప్రచారంపై ఎస్‌డీపీఐ కుట్ర ఉందన్నారు. ఆ వివాదానికి సంబంధించి వెళ్లడం లేదన్నారు. సిట్ తనిఖీలు వేగవంతంగా ముగించాలని, వాస్తవాలను వెలికితీయాలనేది మా డిమాండ్ అన్నారు. గందరగోళానికి బ్రేక్ వేయాలనేది మా ఆశయమన్నారు.

● ఇదే అంశంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే బేళూరు గోపాలకృష్ణ మాట్లాడుతూ మళ్లీ గుంతలు తవ్వుతారో తెలియదని, కానీ ఫిర్యాదుదారుడు కోర్టునుంచి ఆదేశాలు పొందారని, ఆ తర్వాతనే సిట్ ఏర్పాటు చేయాల్సి వచ్చిందన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం కూడా తీవ్రంగానే పరిగనిస్తోందన్నారు. దర్యాప్తునకు సంబంధించి సిట్ మధ్యంతర నివేదిక ఇవ్వడం సాధ్యం కాదన్నారు. దర్యాప్తు పూర్తయ్యాక సీఎం ప్రకటిస్తారన్నారు. బీజేపీ హిందూత్వ ముసుగులో క్రెడిట్ సాధించేందుకు ప్రయత్నిస్తోందని, వారు హైకోర్టుకు వెళ్లవచ్చునన్నారు. మేం కూడా హిందువులమే అన్నారు. కాంగ్రెస్, బీజేపీల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో స్పీకర్ యూటీ కాదర్ జోక్యం చేసుకుని సిట్ దర్యాప్తు చేస్తోందని, సొంత అభిప్రాయాలు అవసరం లేదన్నారు. ఈ అంశంపై సభలో చర్చకు అవకాశం ఇచ్చానన్నారు. మంత్రి దినేశ్ గుండూరావు మాట్లాడుతూ ఇప్పటివరకు ఎటువంటి సాక్ష్యం లేకున్నా తీవ్రస్థాయిలో ప్రచారం సాగుతోందన్నారు. ఆ వ్యక్తి ఉద్దేశ్యం ఏమిటో, పరువుకు భంగం కలిగించేలా ఎందుకు వ్యవహరిస్తున్నారో, వారి ఉద్దేశ్యంపైనా దర్యాప్తు జరిపించాలన్నారు. మాజీ డీసీఎం అశ్వత్థనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వానికి సూక్ష్మత లేదన్నారు. తొలుత ఆరేడు పాయింట్‌లు అన్నారని, ప్రస్తుతం 15 ప్రదేశాలలో తవ్వకాలు సాగాయని, ప్రభుత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు. పీఎఫ్ఐ వంటి సంస్థల వెనుక రహస్యాన్ని ఛేదించాలన్నారు.

● ఈనెల 16న 200 వాహనాలతో యలహంక బీజేపీ ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్ ధర్మస్థళకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ధర్మస్థళపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఉదయం 6 గంటలకు సింగనాయకనహళ్ళి నుంచి ధర్మస్థళకు వెళ్తామన్నారు. మంజునాథస్వామి దర్శనం చేసుకుని ఆలయ పవిత్రతకు భంగం కలిగిస్తున్న దుష్టులకు శిక్షించాలని పూజలు చేస్తామన్నారు. మరుసటి రోజు వెనుతిరిగి వస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఎవరైనా పాల్గొనవచ్చునన్నారు.



వర్షంలో ఇబ్బంది పడుతున్న ప్రజలు



వాహనాల రద్దీ

రాత్రి వరకూ ఒకటే వాన

బెంగళూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర వ్యాప్తంగా బుధవారం ఉదయం నుంచి మేఘావృతమైంది. ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం కురిసింది. పలు ప్రాంతాలలో ఒక మోస్తరు వర్షం నమోదు కాగా మరికొన్నిచోట్ల భారీగా కురిసింది. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఇళ్లకు వెళ్లేందుకు విద్యార్థులు, ఉద్యోగులు గొడుగులను ఆశ్రయించారు. నగరంలో ఎటుచూసినా ప్రజలు, ద్విచక్రవాహనదారులు గొడుగులతోనే రాకపోకలు సాగించారు. వర్షం కారణంగా పలు చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది.

ధర్మస్థళలో కొనసాగుతున్న తవ్వకాలు

బెంగళూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళలో 13వ పాయింట్‌లో జీపీఆర్ టెక్నాలజీ స్కానింగ్ చేసిన ప్రదేశంలో తవ్వకాలు కొనసాగుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి 9 గంటల దాకా ప్రక్రియ కొనసాగింది. ఓవైపు వర్షం కురుస్తున్నా తవ్విన ప్రాంతంలో నీరు వస్తుండడంతో మోటార్లతో తొలగించి ప్రక్రియ కొనసాగిస్తున్నారు. బుధవారం కూడా అదే పాయింట్‌లో తవ్వకాలు కొనసాగించారు. ధర్మస్థళలో మృతదేహాలు పాతిపెట్టారని మాకూ సమాచారం ఉందని స్థానికులు పురందరగౌడ, తుకారాంగౌడలు బుధవారం సిట్ కార్యాలయానికి వచ్చారు. పురందరగౌడ మాట్లాడుతూ నేత్రావతి స్నానఘట్టం సమీపంలో ఓ దుకాణం నిర్వహించేవాడినన్నారు. మృతదేహాలను ఓ వ్యక్తి పూడ్చిపెట్టడం చూశానన్నారు. ఇదే వ్యక్తి ఉండవచ్చునని అనుమానాలు వ్యక్తం చేశారు. వారిద్దరునుంచి కూడా పోలీసులు ఆధారాలు తీసుకున్నారు. కాగా అనన్యభట్ తల్లి సుజాతభట్ ఇటీవల సిట్ అధికారులను కలసి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. మంగళూరులో ఎంబీబీఎస్ చదువుతున్న అనన్యభట్ ధర్మస్థళ సందర్శనకు వచ్చి ఆ తర్వాత మృతి చెందారనే విషయమై తల్లి ఫిర్యాదు చేశారు. సిట్ అధికారులను కలసిన తర్వాత సుజాతభట్ కనిపించకుండా పోయారని ప్రచారం సాగింది. దీంతో సుజాతభట్ బుధవారం అజ్ఞాతస్థలం నుంచి వీడియో ద్వారా వివరణ ఇచ్చారు. నేనెక్కడికీ వెళ్లలేదని తేల్చి చెప్పారు. కుమార్తె అనన్యభట్‌కు సంబంధించిన ఆనవాళ్లు లభిస్తే హిందూ సంప్రదాయం క్రారం ధార్మిక కార్యక్రమాలు చేపట్టాలని ఆమె ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. మరోవైపు ధర్మస్థళకు ఉండే మంచిపేరును చెడగొట్టేందుకు కుట్ర పన్నారని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మొదలయ్యాయి. బెళగావి జిల్లా చిక్కోడి, బెళగావిలలో మహిళలు ఆందోళన చేశారు. ముస్లిం మహిళలు కూడా పాల్గొన్నారు. చిక్కోడి నగరంలో బంద్ చేస్తామని హెచ్చరించారు. బెళగావి, చామరాజనగర, గదగ్, కలబురగి, మైసూరు, తుమకూరులలో ఆందోళనలు కొనసాగాయి.



13వ పాయింట్‌లో కొనసాగుతున్న తవ్వకాలు





రిహార్సల్స్‌లో పాల్గొన్న పోలీసు బలగాలు

వర్షంలోనూ పరేడ్ రిహార్సల్స్

- మాణెక్ షా మైదానం చుట్టూ భారీ బందోబస్తు

బెంగళూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని మాణెక్ షా పరేడ్ మైదానంలో రిహార్సల్స్ ఉత్సాహంగా సాగాయి. ఓవైపు వర్షంలోనూ రిహార్సల్స్‌లో విద్యార్థులు, పోలీసులు, వివిధ విభాగాల బెటాలియన్‌లు భాగస్వాములయ్యారు. బీబీఎంపీ కమిషనర్ మహేశ్వరరావు, బెంగళూరు నగర జిల్లా అధికారి జగదీశ్, నగర పోలీస్ కమిషనర్ సీమంత్‌కుమార్‌సింగ్ బుధవారం మీడియాతో మాట్లాడారు. కమిషనర్ మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 9 గంటలకు సీఎం సిద్దరామయ్య పతాకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. ప్రత్యేక కవాతును వీక్షిస్తారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. పరేడ్ మైదానం చుట్టూ భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సీసీ కెమెరాలు, బ్యాగేజ్ స్కానర్‌లు అమరుస్తామన్నారు. ఆహ్వానితులకు పాస్‌లను పంపిణీ చేశామన్నారు. నగరపోలీస్ కమిషనర్ మాట్లాడుతూ కేఎస్ఆర్‌పీ, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఏఆర్, గోవా పోలీసులు, కేఎస్ఐఎస్ఎఫ్, ట్రాఫిక్ పోలీసులు, మహిళా పోలీసులు, హోంగార్డులు, అగ్నిమాపకశాఖ, డాగ్‌స్క్వాడ్‌తోపాటు 35 ప్లటూన్లనుంచి 1150మంది పాల్గొంటారన్నారు. ఇదే తొలిసారి ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ రూపంలో వీక్షించడంతోపాటు ఇ-పాస్‌లను పంపిణీ చేశామన్నారు. ఆసక్తిగలవారు సేవాసింధు వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చునన్నారు. దూరదర్శన్‌లో నేరుగా ప్రసారం చేస్తామన్నారు. వెయ్యిమంది విద్యార్థులు కళా ప్రదర్శనలలో పాల్గొంటారన్నారు.



వర్షంలోనూ ఏర్పాట్ల పరిశీలన



బ్యాండ్ బృందం



డాగ్‌స్క్వాడ్ కవాతు

నాలుగోసారీ..!

రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక మళ్లీ వాయిదా

గైర్హాజరైన వైసీపీ సభ్యులు


హాజరైన సభ్యులు

రామగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఎంపీపీ ఉప ఎన్నిక మళ్లీ వాయిదా పడింది. ఉప ఎన్నికకు నాలుగో సారి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఉప ఎన్నికకు హాజరు కావాలని ఎంపీటీసీ సభ్యులకు నోటీసులు జారీ చేశారు. బుధవారం ఎంపీపీ ఉప ఎన్నికకు ఏర్పాట్లు చేశారు. వైసీపీ ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి సంజీవయ్య ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ చేపట్టారు. ఒక టీడీపీ ఎంపీటీసీ, ఇద్దరు మద్దతు సభ్యులు హాజరయ్యారు. ఎంపీపీ స్థానం మహిళకు రిజర్వ్ కాగా.. ఎన్నికకు ఎంపికైన ముగ్గురు సభ్యులు పురుషులు కావడం గమనార్హం. ఉప ఎన్నికను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి సంజీవయ్య ప్రకటించారు. తదుపరి ఉత్తర్వుల కోసం ఎన్నికల కమిషన్, జిల్లా పరిషత్ సీఈఓకు లిఖిత పూర్వకంగా తెలియజేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఇప్పటికి నాలుగుసార్లు నోటిఫికేషన్ విడుదల చేసి, ఐదుసార్లు ఎన్నికకు ఏర్పాట్లు చేసినా.. ఒక్కసారి కూడా వైసీపీ సభ్యులు హాజరు కాలేదు. ఎంపీపీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల కాగానే వైసీపీ ఎంపీటీసీ సభ్యులను రాజకీయ క్యాంపులకు తరలించారు. వైసీపీ సభ్యులకు బలమున్నా గైర్హాజరవుతూనే వస్తున్నారు. బుధవారం ఉప ఎన్నికసందర్భంగా సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రీడా అవార్డులకు దరఖాస్తు చేసుకోండి: డీఈఓ

అనంతపురం విద్య, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం క్రీడా ప్రతిభా అవార్డులు ఇవ్వనుందని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. ఈ నెల 29న హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దిన పాఠశాలలకు క్రీడా ప్రతిభా అవార్డులు అందించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. జిల్లాలో ఐదు ఉత్తమ క్రీడా పాఠశాలలను గుర్తించి ఈ అవార్డులు ఇస్తామని అన్నారు. 2024-25 విద్యాసంవత్సరంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన క్రీడల్లో పాల్గొన్న వాటిని మాత్రమే పరిగణలోకి తీసుకుంటామని వివరించారు. అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలలకు ఈ అవకాశం ఉంటుందన్నారు. టీమ్ ఈవెంట్స్ వ్యక్తిగత ఈవెంట్స్ పాయింట్ల అనుబంధంలో ఇచ్చిన మేరకు పరిగణిస్తామని పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఐదుగురితో కమిటీని నియమించి దరఖాస్తులను పరిశీలిస్తామని అన్నారు. ఎంపికైన ఐదు పాఠశాలలకు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈనెల29న అవార్డులు ఇస్తామని డీఈఓ తెలిపారు.

బైక్‌ల చోరీ కేసులో నిందితుడి అరెస్టు


స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

పెనుకొండ టౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర ద్విచక్రవాహనాల దొంగను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ నర్సింగప్ప తెలిపారు. బుధవారం స్థానిక సీఐ కార్యాలయంలో ద్విచక్రవాహనాల చోరీ గురించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మంగళవారం పెనుకొండ మండలం దుద్దేబండ క్రాస్‌వద్ద సీఐ రాఘవన్, ఎస్ఐ రాజేష్, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా పెనుకొండ మండలం మునిమడుగు గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఆపి రికార్డులు పరిశీలించారు. రికార్డులు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించి విచారిస్తే అసలు గుట్టు బయటపడిందన్నారు. వినోద్‌కుమార్ మునిడుగులో నివాసముంటాడని తెలిపారు. నకిలీ కీ ద్వారా ద్విచక్రవాహనాల దొంగలిస్తాడని, వాటిని తక్కువ ధరకు విక్రయించేవాడని దర్యాప్తులో తేలిందన్నారు. జాతీయరహదారి సమీపంలో పాడుబడ్డ పరిశ్రమలో దాచి ఉంచిన 31 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటి విలువ రూ.18.60 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఇప్పటికే ఇతడిపై పలు ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయని తెలిపారు. కేసు నమోదుచేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. కేసు ఛేదింపులో ప్రతిభ కనబరచిన కానిస్టేబుళ్లు నాగరాజు, మారుతిని ఎస్పీ రత్న అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ట్రైనీ ఎస్ఐ భువనేశ్వరి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసభ్యకర పోస్టు.. కేసు నమోదు

పుట్లూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టు పెట్టిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. ఓబులాపురం గ్రామానికి చెందిన వేలూరు వేణుగోపాల్‌నాయుడు అనే వ్యక్తి ఐడీపై ఎమ్మెల్యే, అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులునాయుడుపై అసభ్యకరంగా పోస్టులు పెట్టారు. శ్రీనివాసులునాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైల్వేగేట్ మరమ్మతులు వాయిదా

ముదిగుబ్బ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుంజేపల్లి సమీపంలోని కృష్ణాపురం క్రాస్ వద్ద గల రైల్వేగేట్ మరమ్మతులను రైల్వే శాఖ వాయిదా వేసింది. ఈనెల 13, 14 తేదీల్లో చేపట్టాల్సిన మరమ్మతులను వర్షాల కారణంగా నిలిపివేశారు. వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగనున్నట్లు బుధవారం రైల్వే అధికారులు తెలిపారు.

రెండు గ్రామ పంచాయతీలకు అవార్డులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెండు గ్రామ పంచాయతీలకు కేంద్ర జలశక్తి అవార్డులు దక్కాయి. జలశక్తి అభియాన్‌లో భాగంగా వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు తీసుకున్న చర్యల పరంగా నార్పల మండలం బొందలవాడ, గుత్తి మండలం యంగన్నపల్లి పంచాయతీలను అవార్డులకు ఎంపిక చేసినట్లు డ్వామా పీడీ సలీంబాషా బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు ఆలం శిరీష, భరత్‌కుమార్‌కు ఈనెల 15న ఢిల్లీలో స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా అవార్డులు అందజేయనున్నారు. వారికి కేంద్ర జలశక్తి ఉన్నతాధికారులు ఆహ్వానం పంపారని పీడీ వెల్లడించారు.

స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలి

ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈనెల 15న స్వాతంత్ర్య వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. ఏఆర్ ఏఎస్పీ ఇలియాజ్ బాషా, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్‌తో కలిసి బుధవారం పోలీసు పరేడ్ మైదానంలో కార్యక్రమాల నిర్వహణ పనులను పరిశీలించారు. తొలుత పోలీసు కవాతు తదితర రిహార్సల్స్ నిర్వహించారు. అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునుడు, రామ్మోహన్, డీపీఆర్‌ఓ బాల కొండయ్య, హౌసింగ్ పీడీ శైలజ, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ ఈఈ రమేష్, డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి పాల్గొన్నారు.


ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

పంటలకు వాన దెబ్బ

తడిసిన వేరుశనగ కట్టె

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

ఎడతెరిపి లేని వానలు ఉమ్మడి జిల్లాలో పంటలను దెబ్బతీస్తున్నాయి. బోరుబావుల కింద చేతికొచ్చిన వేరుశనగ పంటను పలు ప్రాంతాల్లో రైతులు తొలగించారు. ఆ వెంటనే వర్షాలు ప్రారంభం కావడంతో కట్టె తడిసిపోయి నల్లగా మారి, పశుగ్రాసానికి పనికిరాకుండా పోతోంది. కాయలకు మొలకలు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. చాలా ప్రాంతాల్లో పొలాల్లో నీరు నిలిచి పంట దెబ్బతింటోంది. జిల్లా వ్యాప్తంగా 25 మండలాల్లో మంగళవారం వర్షం కురిసింది. అత్యధికంగా పెద్దపప్పూరు మండలంలో 2.1 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. గుంతకల్లు 2.0, కళ్యాణదుర్గం 1.3, బెళుగుప్ప మండలంలో 1.2 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో ఒక సెంటీ మీటరు లోపు నమోదైంది. జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం వర్షం కొనసాగింది. శ్రీసత్యసాయి జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. గుడిబండ మండలంలో అత్యధికంగా మంగళవారం 1.96 సెం.మీ. వర్షపాతం నమోదైంది. హిందూపురం 1.7, గోరంట్ల 1.6, చిలమత్తూరు 1.26, రొళ్ల 1.14, మడకశిర 1.04 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో ఒక సెంటీమీటరు లోపు వర్షాలు కురిశాయి. అనంతపురం, యాడికి, పుట్లూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

నీట మునిగిన వేరుశనగ పంట


కుళ్లిపోయిన పంటను చూపిస్తున్న బాధిత రైతులు

కణేకల్లు మండల పరిధిలోని గరుడచేడు వద్ద వేదవతి నది పరీవాహకంలోని 200 ఎకరాల్లో వేరుశనగ పంట నీటమునిగింది. నాగేపల్లి, తుంబిగనూరు గ్రామాల పొలాల్లోని వంక నీరు వేదవతి నదిలోకి వెళ్లకుండా గరుడచేడు గ్రామంలోని వేరుశనగ పంట పొలాల్లోకి చేరుతోంది. దీంతో పంటలు దెబ్బతింటున్నాయి. సుమారు 50 మంది రైతులకు చెందిన 200 ఎకరాల్లోకి వరద నీరు చేరింది. మరో 20 రోజుల్లో చేతికొచ్చే వేరుశనగ పంట దెబ్బతింటోంది. తమకు ఇప్పటికే రూ.30 లక్షలకుపైగా నష్టం జరిగిందని బాధిత రైతులు వాపోతున్నారు. బొమ్మనహాళ్ మండలం దేవగిరి క్రాస్‌లో కౌలు రైతు పరమేష్ ఆరు రోజుల క్రితం ఆరు ఎకరాల్లో వేరుశనగ పంటను కోశాడు. మరుసటి రోజు నుంచి వరుసగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పొలంలోనే కుప్పలుగా వేసిన వేరుశనగ కట్టె తడిసి బూజుపట్టింది. రూ.5 లక్షలదాకా నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు. స్థానిక టీడీపీ నాయకులు మల్లీడు శ్రీనివాసులు, రేవణ్ణ, సొల్లాపురం బాబు పంటను పరిశీలించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లి బాధితుడిని ఆదుకుంటామని తెలిపారు. నల్లచెరువు నూరుద్దీన్ కాలనీలో సుబహాన్ అనే వ్యక్తి ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.


గరుడచేడు వద్ద నీట మునిగిన వేరుశనగ పంట

రైతుల ప్రాణాలు పోయినా పట్టదా..?

విద్యార్థులు అస్వస్థతకు గురైనా నిర్లక్ష్యమా..?

జడ్పీటీసీ సభ్యుల ఆగ్రహం

వాడీవేడిగా జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు


మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రైతుల ప్రాణాలు పోయినా.. సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు అస్వస్థతకు గురైనా అధికారులకు పట్టడం లేదని జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఉదయం 10 గంటకు ప్రారంభం కావాల్సిన సమావేశం జడ్పీటీసీ సభ్యులు సకాలంలో రాకపోవడంతో 11.30 గంటలకు ప్రారంభించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం జడ్పీటీసీ సభ్యులు చంద్రమోహన్, భాస్కర్ జడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి తెచ్చారు. నకిలీ విత్తనాలతో పంటలు చేతికిరాక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, విత్తనాలు సరఫరా చేసేవారిపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన చైర్‌పర్సన్ గిరిజమ్మ.. ఈ సమస్యకు తగిన సమాధానం ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మను ఆదేశించారు. సంబంధిత ఏడీలతో సభ్యుల ముందుకు వచ్చి సమాధానం ఇచ్చే ప్రయత్నం చేశారు. ఆమె ఇచ్చే సమాధానానికి సంతృప్తి చెందని సభ్యులు అసలు జిల్లాలో విత్తనాలు అమ్మడానికి ఎంత మందికి అనుమతి ఉంది, విత్తన నాణ్యతపై ఎన్ని తనిఖీలు చేస్తున్నారు, ఎన్ని ప్రాంతాల్లో నాణ్యతలేని విత్తనాలు అమ్ముతున్నట్లు గుర్తించారని నిలదీశారు. ఆర్బీకేల్లో యూరియా కావాలని అడిగితే స్టాక్ లేదంటున్నారని, యూరియా లేకుండా వరి నాట్లు ఏ విధంగా వేస్తారని నిలదీశారు. దీంతో ఖంగుతిన్న ఉమామహేశ్వరమ్మ వివరాలు మండల అధికారుల వద్దనే ఉంటాయని సమాధానం ఇచ్చారు. మరింత ఆగ్రహానికి లోనైన సభ్యులు ఆర్బీకేల్లో, మండల స్థాయి అధికారుల వద్ద వివరాలు ఉంటే మీతో సమావేశంలో ఎందుకు చర్చించాల్సి వస్తుందని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము చాలా మందికి పడలేదని తెలిపారు.

విద్యార్థుల సమస్యలు పట్టించుకోరా..?

విద్యార్థులు అస్వస్థతకు గురైనా అధికారులకు పట్టదా అని పలువురు సభ్యులు ప్రశ్నించారు. ఈమధ్య కాలంలో సంక్షేమ హస్టళ్ల, గురుకుల పాఠశాలలు, మధ్యాహ్న భోజనం అందించే పాఠశాలల్లోను భోజనం తిని విద్యార్థులు అస్వస్థకు గురవుతున్నారని తెలిపారు. స్పందించిన డీఈఓ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. నాణ్యత లేని భోజనం, ఇతర సమస్యలతోనే ఇలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహించిన జడ్పీటీసీ సభ్యులు దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. బుక్కరాయసముద్రం జడ్పీటీసీ భాస్కర్ మాట్లాడుతూ.. సిద్దరాంపురం జిల్లా పరిషత్ పాఠశాలలో తమ పిల్లలను చదివిస్తున్నామని, అక్కడ మధ్యాహ్న భోజనం చాలా దారుణంగా ఉందన్నారు. అలాంటప్పుడు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసి ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. రొద్దం మండలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని స్థానిక జడ్పీటీసీ ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ కారం ఎక్కువ ఉందని విద్యార్థులు భోజనం కిందపడేసిన ఘటన సోషల్ మీడియాలో వచ్చినా అధికారుల్లో స్పందన రాలేదన్నారు. జిల్లాకు కూత వేటు దూరంలో ఉండే బుక్కరాయసముద్రం మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు ప్లేట్లు కడుక్కోవడానికి నీళ్ల లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. మరుగుదొడ్లు సరిగా లేక గుట్టల వెంబడి పోతున్నారని అన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని అధికారులను నిలదీశారు. సమావేశంలో జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డిప్యూటీ చైర్‌పర్సన్ నాగరత్న, సభ్యులు పాల్గొన్నారు.

పొలాలను పరిశీలించిన రెవెన్యూ అధికారులు

కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆరా

రొద్దం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడగట్ట గ్రామానికి చెందిన రైతుల పొలాలను తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు పరిశీలించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో 'ఓ పట్టాన తెగదే..' అన్న శీర్షికతో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ స్పందించి రొద్దం తహసీల్దార్‌తో ఆరాతీశారు. దీంతో తహసీల్దార్, వారి సిబ్బంది రెడ్డిపల్లి రెవెన్యూ పరిధిలోని 284.71 ఎకరాల్లో సాగుచేసిన కంది పంటను పరిశీలించారు. 1951లో ఎవరికి పట్టా ఇచ్చారు, అందులో సభ్యులు ఎంతమంది, ప్రస్తుతం ఎంతమంది ఉన్నారనే అంశాలను ఆరాతీశారు. ల్యాండ్ కాలనైజేషన్ సొసైటీ కింద ఇచ్చిన రికార్డులను అధ్యక్షుడు చంద్రశేఖర్‌తో పరిశీలించారు. కలెక్టర్, జేసీ ఆదేశాల మేరకు 284.71 ఎకరాలకు సంబంధించిన భూరికార్డులను రొద్దం తహసీల్దార్ కార్యాలయం నుంచి తీసుకుని పుట్టపర్తికి తహసీల్దార్ తరలి వెళ్లారు. పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ సైతం దొడగట్ట భూ వ్యవహారంపై జిల్లా అధికారుల వద్దకు వెళ్లినట్లు సమాచారం. తహసీల్దార్ వెంట రీసర్వే డీటీ చంద్రశేఖర్, ఆర్ఐ లక్ష్మీదేవి, వీఆర్‌ఓలు గోపాల్, ఓబులేసు, సర్వేయర్లు పాల్గొన్నారు.


పొలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలి

రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి

అనంతపురం టౌన్/క్లాక్‌టవర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం రైతు సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో 'రాయలసీమ ప్రాజెక్టులు-పరిష్కార మార్గాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాయలసీమలో హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగు గంగ ప్రాజెక్టులు ప్రారంభించి 37 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ పూర్తి చేయకపోవడం ముమ్మాటికీ పాలకవర్గాల నిర్లక్ష్యమేనని విమర్శించారు. ఈ ప్రాజెక్టులు పూర్తి చేసి, రాయలసీమలో 13 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించి ఉండుంటే రాయలసీమ సస్యశ్యామలం అయ్యేదన్నారు. రాష్ట్రంలోనే ఉమ్మడి అనంతపురం జిల్లా తీవ్ర కరువు పరిస్థితులు ఎదుర్కొంటోందన్నారు. వర్షాలు కురవక, చెరువులు నిండక, భూగర్భజలాలు అడుగంటి వ్యవసాయం చేయలేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. కరువులతో వలసలు, రైతు ఆత్మహత్యలు పెరిగాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 4లక్షల మందికిపైగా రైతు కూలీలు వలస వెళ్లారన్నారు. 20 ఏళ్లలో ఉమ్మడి జిల్లాలో 3 వేల మంది రైతు కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారనీ, ఏడాదిలోనే 80 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని వాపోయారు. ఈ సంక్షోభం నుంచి జిల్లా ప్రజలు బయట పడాలంటే హంద్రీనీవా ప్రాజెక్టు ఒక్కటే శరణ్యమన్నారు. 3.45 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వాల్సి ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాలో 1400 చెరువులు ఉండగా.. 100 మాత్రమే నింపుతున్నారన్నారు. వెయ్యి చెరువులకు నీరిస్తామని ప్రభుత్వాలు ప్రకటించినా ఆ ప్రయోజనం నెరవేరే అవకాశం లేకుండా పోయిందన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జల సాధన సమితి అధ్యక్షుడు రామ్‌కుమార్, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, రచయిత అప్పిరెడ్డి హరినాథరెడ్డి, రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, రైతు సంక్షేమ సంఘం నాయకులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ప్రకాష్, రామకృష్ణారెడ్డి, శేషాద్రిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బొజ్జా దశరథ రామిరెడ్డి

కూలి బతుకులో విషాదం

కొంపముంచిన అతివేగం

కూలీల ఆటోను ఢీకొన్న క్రూజర్ వాహనం

ఒకరు మృతి.. 8 మందికి గాయాలు

తనకల్లు, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): అతివేగం, నిర్లక్ష్యం కూలి బతుకులో విషాదం నింపింది. మండలంలోని చీకటిమానుపల్లి వద్ద బుధవారం కూలీల ఆటోను క్రూజర్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో లక్ష్మమ్మ(60) మృతిచెందగా.. 8మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్లగుట్టపల్లికి చెందిన కూలీలు చీకటిమానుపల్లి సమీపంలో ఉన్న పరిశ్రమలో పనుల కోసం ఆటోలో ఉదయం బయల్దేరారు. తిరుపతి నుంచి కర్ణాటకలోని బాగల్‌కోటకు వెళ్తున్న క్రూజర్ వాహనం చీకటిమాను పల్లి వద్ద కూలీల ఆటోను బలంగా ఢీకొంది. క్రూజర్ వాహన డ్రైవర్ నిర్లక్ష్యంగా అతివేగంగా తోలుతూ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టాడు. ప్రమాదంలో లక్ష్మమ్మ, వెంకటరమణ, ప్రమీల, ఉషారాణి, మజ్జీన్, రమాదేవి, షేక్ షహనాజ్, సాలెమ్మ, నసీరూన్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని వందేమాతరం టీమ్ అంబులెన్స్‌లో తనకల్లుకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కదిరికి తీసుకెళ్లారు. వీరిలో లక్ష్మమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం తరలించారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె మరణించింది. లక్ష్మమ్మది అన్నమయ్య జిల్లా కోత్తకోట. కొంతకాలంగా నల్లగుట్టపల్లిలో కుమార్తె వద్ద ఉంటుండేది. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

ఆటో బోల్తా.. ఒకరు మృతి

- ఇద్దరికి గాయాలు


దేవరాజ్ (ఫైల్)

అమడగూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్ - కొక్కంటి క్రాస్ రహదారిలో నిలువురాతిపల్లి సమీపంలో బుధవారం ఆటో బోల్తాపడి ఒకరు మృతిచెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఓడీసీ మండల కేంద్రానికి చెందిన దేవరాజ్ (37)ను కదిరి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. దేవరాజ్ ఓడీసీ చర్చిలో ఫాదర్‌గా పని చేస్తూ, కుటుంబ పోషణకోసం అన్నమయ్య జిల్లాలోని మొలకచెరువు టమోట మార్కెట్‌లో కూలి పని చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఆటో ప్రతిరోజు ఓడీసీ మండల కేంద్రం నుంచి కూలీలతో అన్నమయ్య జిల్లా మొలకలచెరువు టమోటా మండీకి కూలీలను రవాణా చేసేవారు. బుధవారం 12మంది కూలీలతో వెళుతుండగా మలుపులో అదుపు తప్పి బోల్తాపడిందన్నారు. ఇందులో డబురవాండ్లపల్లికి చెందిన అంజనేయులు తీవ్రంగా గాయపడ్డారు. ఎం.కొత్తపల్లి ఆంజనేయులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని కదిరి ఏరియా ఆసుపత్రికి 108లో తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

భర్త ఆత్మహత్య కేసులో భార్యకు రిమాండ్

పెనుకొండ టౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పెనుకొండ మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన నంజుండ (35) ఆత్మహత్య కేసులో అతడి భార్య నాగవేణికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. ఈ ఏడాది మార్చి 12న నంజుండ ఇంట్లో ఉరేసుకున్నాడు. అంతకు ముందురోజు భార్యాభర్త గొడవపడ్డారని విచారణలో తేలింది. అదే గ్రామానికి చెందిన రమేష్‌తో నాగవేణి వివాహేతర సంబంధం విషయంలోనే ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన నంజుండ ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పట్లో నంజుండ అన్న ముత్యాలప్ప ఫిర్యాదు మేరకు రమేష్, నాగవేణిపై కేసు నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి.. నాగవేణికి 14రోజుల రిమాండ్ విధించారన్నారు. రమేష్‌కు బెయిల్ మంజూరు చేసినట్లు తెలిపారు.

ప్రియుడి వివాహాన్ని అడ్డుకున్న బాలిక

● పోలీసుల అదుపులో నిందితుడు

పుట్లూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తనను ప్రేమించిన ప్రియుడు మోసం చేయడమే కాకుండా, తనకు తెలియకుండా వివాహం చేసుకుంటాడా అంటూ ఓ బాలిక బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు వెళ్లి పెళ్లిని ఆపేసి ప్రియుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన పుట్లూరు మండలంలోని ఓ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఓ గ్రామానికి చెందిన బాలిక(17) అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు(22) ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలని అడగడంతో ఆ అబ్బాయి మొహం చాటేశాడు. గార్లదిన్నె మండలంలోని ఓ గ్రామానికి చెందిన అమ్మాయితో వివాహం నిశ్చయించారు. బుధవారం ఉదయం పెళ్లి జరుగుతున్న విషయం తెలుసుకున్న ఆ బాలిక మంగళవారం విషపు గుళికలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. శింగనమల మండలంలోని ఓ దేవాలయంలో జరుగుతున్న వివాహాన్ని తాళికట్టే సమయంలో వెళ్లి పోలీసులు ఆపేశారు. ఓ బాలికను మీ అబ్బాయి మోసం చేశాడని తల్లిదండ్రులకు చెప్పి అదుపులోకి తీసుకున్నారు. పెళ్లికి సిద్ధమైన ఆ అమ్మాయి సైతం తన మండలంలో పెళ్లి కొడుకుపై మోసం చేశాడని ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆ అమ్మాయి కూడా మైనర్ కావడం గమనార్హం.

కడుపునొప్పి భరించలేక రైతు ఆత్మహత్య

పెనుకొండ రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మావటూరు గ్రామానికి చెందిన రైతు సంజీవప్ప(47) కడుపునొప్పి భరించలేక బుధవారం ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. మావటూరు గ్రామానికి చెందిన సంజీవప్ప తనకున్న పొలంలో మల్బరీ సాగు చేస్తూ, కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించినా నయంలేదు. బుధవారం కడుపునొప్పి తీవ్రంగా రావడంతో మనస్తాపం చెందిన సంజీవప్ప రేషం షెడ్డులో పైకప్పునకు ఉరేసుకుని, మరణించాడు. తరువాత గమనించిన కుటుంబ సభ్యులు.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. సంజీవప్ప భార్య ముత్యాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రైతుకు కుమార్తె ఉంది.

20 నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ

ధర్మవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి స్మారకార్థం ఈనెల 21వ తేదీ నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీశ్‌బాబు బుధవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... స్థానిక ఆర్డీటీ క్రీడా మైదానంలో ఈనెల 20 నుంచి సెప్టెంబరు 16వ తేదీ వరకు క్రికెట్ పోటీలు ఉంటాయన్నారు. జిల్లాలోని క్రికెటర్లు మాత్రమే అర్హులన్నారు. విజేత జట్టుకు రూ.1లక్ష, రన్నరప్‌కు రూ.50వేలు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఈనెల 17వ తేదీలోపు జట్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9985929285 నంబరులో సంప్రదించాలన్నారు.

270.94 టన్నులు

● తేలిన రేషన్ బియ్యం లెక్క ● నలుగురిపై కేసు నమోదు


● ముగ్గురి అరెస్టు ● పరారీలో ప్రధాన నిందితుడు

యాడికి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై బుధవారం అధికారులు లెక్క తేల్చారు. యాడికిలోని రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం 270.940 టన్నులు ఉన్నాయనీ, వీటివిలువ రూ.1.24 కోట్లు ఉంటుందని సీఐ ఈరన్న, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్ తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాలో పాల్గొన్న లారీ, బొలెరో, ఆటో డ్రైవర్లను అరెస్టు చేశారు. యాడికి పోలీసు స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 10వతేదీన రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తుండగా.. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది దాడిచేసి మూడు వాహనాలను పట్టుకున్నారు. లారీ, బొలెరో, ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం సీజ్ చేశారు. డ్రైవర్లను విచారించగా బలరాముడు రైస్‌మిల్లు నుంచి రవాణా చేస్తున్నట్లు తెలిపారు. రైస్‌మిల్లుపై సెర్చ్ వారెంట్ తీసుకుని, సోదాలు నిర్వహించగా పెద్దఎత్తున రేషన్ బియ్యం పట్టుబడింది. 270.940 టన్నుల రేషన్ బియ్యం సీజ్ చేశారు. ప్రభుత్వ ధరల ప్రకారం కిలో బియ్యం రూ.46 అనీ, రైస్‌మిల్లులో సీజ్‌చేసిన బియ్యం విలువ రూ.1.24 కోట్లు ఉంటుందని తెలిపారు. సీజ్‌చేసిన రేషన్ బియ్యాన్ని గుంతకల్లులోని పౌరసరఫరాల బఫర్ గోడౌన్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో నలుగురిపై కేసు నమోదు చేశారు. ముగ్గురు డ్రైవర్లు మసూద్‌వలి, గంగాధర్, ఖాసీంవలిని అరెస్టు చేశారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించిన ప్రధాన నిందితుడు బలరాముడును త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు వెల్లడించారు. సమావేశంలో ఏఎస్ఐ వెంకటేష్, సిబ్బంది రంగనాయకులు, రామాంజనేయులరెడ్డి, సూర్యనారాయణ, మహేష్ పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

యోగిరాజ్ వేధాత్రి మహర్షి (జయంతి)



యోగిరాజ్ వేధాత్రి మహర్షి 1911 ఆగస్టు 14న తమిళనాడు రాష్ట్రం చెంగల్పట్టు జిల్లా గుడువాంచేరిలో జన్మించారు. ఆధ్యాత్మికవేత్త. ప్రపంచశాంతికి ఐక్యరాజ్య సమితి సదస్సులో 14 సూత్రాలు ప్రతిపాదించారు. అంతేకాక కుండలిని యోగాపై ప్రసంగించారు. చెన్నైలోని వరల్డ్ కమ్యూనిటీ సెంటర్ వ్యవస్థాపకుడు. తత్వవేత్త, సైంటిస్టు, ఆయుర్వేదిక్, హోమియోపతిక్ వైద్యులు. 300కుపైగా యోగా కేంద్రాలు స్థాపించి, 80 పుస్తకాలు రాశారు. కుండలిని యోగా, వ్యాయామం, కాయకల్ప యోగాలను విస్తృతం చేశారు. మానవత్వంతో ముందుకు సాగాలని ఆచరించి చూపారు. ద్రావిడ వర్శిటీచే 19వ శతాబ్దపు సిద్ధగా గుర్తింపు పొందారు. 2006 మార్చి 28న కన్నుమూశారు.

రెనె గాసిన్ని (జయంతి)



ఫ్రెంచ్ దేశపు రచయిత, సంపాదకులు రెనె గాసిన్ని 1926 ఆగస్టు 14న జన్మించారు. ఏస్టరిక్స్ కామిక్ బుక్ సిరీస్‌ను ఇల్లుస్ట్రేటర్ అల్బెర్ట్ అండర్‌జోతో కలసి రూపొందించారు. 1959లో ఫ్రాన్స్-బెల్జియన్ కామిక్స్ మ్యాగజైన్ 'పిలోటె'ను ప్రారంభించారు. పలువురు రచయితలను పరిచయం చేశారు. 1977 నవంబరు 5న కన్నుమూశారు. 2010 ఆయన కాంస్య విగ్రహం పారిస్‌లో ఏర్పాటు చేశారు. కామిక్ పుస్తక రచయితకు దక్కిన తొలి గౌరవంగా చెప్పవచ్చు.

విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ (వర్ధంతి)



విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ 1945 మే 26న మహారాష్ట్ర రాష్ట్రం లాథూర్ జిల్లా బభల్‌గావ్ ప్రాంతంలో జన్మించారు. మహారాష్ట్రకు రెండుసార్లు ముఖ్యమంత్రిగా 1999-2003 వరకు, 2004-2008 వరకు కొనసాగారు. రాజ్యసభ సభ్యుడిగాను, కేంద్రంలో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎర్త్ సైన్సెస్, ఎంఎస్ఎంఈ, పంచాయతీరాజ్, రూరల్ డెవలెప్‌మెంట్, భారీ పరిశ్రమల శాఖ కేంద్ర మంత్రిగా వ్యవహరించారు. రాజకీయాల్లోకి రాకమునుపు లా ప్రాక్టీస్ చేశారు. ట్రస్టు ఏర్పాటు చేసి పలు కళాశాలలను స్థాపించారు. కాగా ఆయన కుమారులలో ఒకరైన రితీశ్ దేశ్‌ముఖ్ నటుడిగా రాణిస్తున్నారు. 2012 ఆగస్టు 14న విలాస్‌రావ్ కన్నుమూశారు.

జానీ లీవర్ (పుట్టినరోజు)



జానీ లీవర్ 1957 ఆగస్టు 14న ప్రకాశం జిల్లా కనిగిరిలో జన్మించారు. అసలు పేరు జాన్ ప్రకాశ్ రావు జనుమల. తండ్రి హిందూస్థాన్ లీవర్ ఉద్యోగి కావడంతో జానీ లీవర్‌గా గుర్తింపు పొందారు. హిందీ సినీ రంగంలో పేరొందిన కమెడియన్. బాలీవుడ్‌లో 300కుపైగా సినిమాలలో నటించారు. దీవానా మస్తానా (1997), దుల్హే రాజా (1998) సినిమాలకు ఉత్తమ కమెడియన్ పురస్కారం అందుకున్నారు. 13 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. ముంబైలో మిమిక్రీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

ప్రముఖ దర్శకుడు మురళీమోహన్ మృతి



బెంగళూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శాండల్‌వుడ్‌లో ప్రముఖ, సీనియర్ దర్శకుడిగా పేరొందిన ఎస్ మురళిమోహన్ (57) మృతిచెందారు. ఉపేంద్ర నటించిన ష్.., ఓం సినిమాలకు ఆయన సహాయదర్శకుడిగా పనిచేసి తర్వాత నాగరహావు, సంత, మల్లికార్జున వంటి సినిమాలకు దర్శకత్వం వహించారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన పలు అవయవాల వైఫల్యం కారణంగా బుధవారం తుదిశ్వాస వీడారు. నటుడు ఉపేంద్రతోపాటు పలువురు సంతాపం తెలిపారు. హీరోలు శివరాజ్‌కుమార్, రవిచంద్రన్, కిచ్చసుదీప్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

పంట నమోదు చేస్తేనే పథకాల వర్తింపు: ఏఓ

సోమందేపల్లి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలను తప్పనిసరిగా నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్థాయని ఏఓ విజయభారతి తెలిపారు. బుధవారం మండలంలోని నడింపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ కోసం పట్టాదారు పాసుపుస్తకాన్ని ఆధార్‌తో లింక్ చేసుకోవాలన్నారు. ఎన్‌పీసీఐ లింక్ లేనివారు బ్యాంక్ ఖాతాకు ఆధార్‌ను తప్పనిసరిగా లింక్ చేసుకోవాలన్నారు. అలాగే పంటలకు ఇన్సురెన్స్ చెల్లించనివారు ఈనెల 15లోపు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సిరికల్చర్ టెక్నికల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్‌రామాంజినేయులు, ఆంజనేయులు, శీన, సతీష్, రైతులు, ఏఈఓ అల్తెఖ్య, బీఎస్ఏ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరగాలి

క్విజ్ పోటీలలో రాణించిన పంచముఖి విద్యార్థులు



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

శిడ్లఘట్ట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ శోభాయాత్ర ఆచరణ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీలలో పంచముఖి పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. ద్వితీయ, తృతీయస్థానాలలో క్రెసెంట్ పాఠశాల విద్యార్థులు నిలిచారు. చిక్కదాసరహళ్ళిలోని లక్ష్మీవిద్యానికేతన్ స్కూల్ ముఖ్యులు దేవరాజ్ మాట్లాడుతూ మన పిల్లలకు శ్రీరామాయణం, మహాభరతం పురాణాలను వివరించి వాటి సారాంశాలను తెలియచేయాలన్నారు. పిల్లలకు ఉత్తమ విద్యతోపాటు మన ధైర్యం, సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించాలన్నారు. తాలూకాలోని హండిగనాళలోని కేవీ బవన్‌లో ట్రస్టు ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులకు శ్రీరామాయణం, మహాభారతం, స్వాతంత్ర్య పోరాట నేతల గురించి క్విజ్ విజేతలకు బహుమతులను ప్రదానం చేసి మాట్లాడారు. ఇటీవలికాలంలో పాఠశాల, కళాశాలల్లో కేవలం చదవడం, మార్కులు సాధించే విద్యార్థులను తయారు చేయడం మినహా పెద్దలపట్ల భక్తిభావం, మన సంస్కృతి పట్ల అవగాహన కల్పించే కార్యక్రమాలు తగ్గాయని విచారం వ్యక్తం చేశారు. తాలూకాలోని 37 హైస్కూళ్లనుంచి తలా ఇద్దరు మొత్తం 74మంది క్విజ్ పోటీలలో పాల్గొన్నారు. తొలి మూడు రౌండ్లలో లిఖిత పరీక్ష, ఫైనల్స్‌లో పంచముఖి స్కూల్ విద్యార్థులు రాణించారు. మొదటి బహుమతిగా రూ.50వేలు, ద్వితీయ బహుమతిగా క్రెసెంట్ స్కూల్ సీబీఎస్ఈ విద్యార్థులు రూ.30వేలు, తృతీయ బహుమతిగా క్రెసెంట్‌స్కూల్ స్టేట్‌బోర్డు స్కూల్ విద్యార్థులు రూ.20వేలు నగదు బహుమతి గెలుపొందారు. క్విజ్ పోటీలలో రాణించిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, షీల్డ్ అందచేసి అభినందించారు. కాగా తరచుగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సామాజిక స్పృహపై అవగాహన కలుగుతుందని అభిప్రాయపడ్డారు.

బగర్‌హుకుం భూములలో అన్యాయంపై నిరసన



నిరసన తెలుపుతున్న దళితసంఘాల నాయకులు, కార్యకర్తలు

మహదేవపుర ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): బగర్‌హుకుం సాగుకు సంబంధించి ఎస్సీ ఎస్టీలకు చెందిన భూమిని అటవీశాఖ వాపసు తీసుకోవడం నిలిపివేయాలని దళిత సంఘం డిమాండ్ చేసింది. అటవీశాఖ ఆధ్వర్యంలో రైతులు, దళితులు సాగు చేసుకుంటున్న భూములలో కోత విధించడాన్ని దళిత సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. భీమ్‌ప్రజాసంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైట్‌ఫీల్డ్ మురుగేశ్ మాట్లాడుతూ.. రైతుల అటవీ భూములను లాగేసుకునేలా వ్యవహరిస్తున్న సిద్దరామయ్య ప్రభుత్వాన్ని అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె తీరును తప్పుబట్టారు. ఎస్సీ, ఎస్టీ గ్రాంట్లు రూ.40వేల కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీ పథకాలకు వినియోగించిందని, వెంటనే ఎస్సీ, ఎస్టీ సంక్షేమాలకు సదరు నిధులను మళ్లించాలని డిమాండ్ చేశారు. 200 మీటర్ల ఎత్తైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. బగర్‌హుకుం సాగుకు సంబంధించి అటవీశాఖ భూములను వెనక్కి తీసుకోవడం మానేయాలని, అన్యాయానికి గురవుతున్నవారికి భూమిని అప్పగించాలన్నారు. సదరు భూమిని రెవెన్యూశాఖ ద్వారా ఫాం నెంబరు 10 ద్వారా కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరును ఖండిస్తూ నినాదాలు చేశారు. నిరసనలో పెద్దసంఖ్యలో దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వందరోజుల ప్రపంచ సాంస్కృతిక మహోత్సవం



మధుసూదన్‌సాయి

బెంగళూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): దేశంలోని విశిష్టమైన సాంస్కృతిక సమాగమలలో ఒకటైన సాంస్కృతిక మహోత్సవం ఈనెల 16న శనివారం నుంచి వందరోజులపాటు ఒకే ప్రపంచం ఒకే కుటుంబం పేరిట నిర్వహిస్తున్నట్టు ఆధ్యాత్మిక గురువు మధుసూదన్‌సాయి తెలిపారు. చిక్కబళ్ళాపుర సమీపంలోని ముద్దేనహళ్ళి సత్యసాయి గ్రామంలో సంస్కృతిక మహోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వందరోజులపాటు వందేశాలను ఏకం చేసేలా ఉత్సవం ఉంటుందన్నారు. కళలు, సంగీతం, ఆధ్యాత్మికత సేవల ద్వారా మానవత్వం కూడా ముఖ్యమన్నారు. భిన్నత్వంలో ఏకత్వం అనే భావనకు సరిహద్దులను దాటి కట్టిపడేసేలాంటి శక్తివంతమైన వేడుకగా అభివర్ణించారు. అతిరుద్ర మహాయజ్ఞం, దుర్గాపూజ వంటి ఆధ్యాత్మిక పూజలు కూడా ఉంటాయని, శ్రీదివ్యశక్తిని ఆరాధిస్తూ శాంతిని ప్రేరేపించ వచ్చుననేలాంటి కార్యక్రమాలు ఉంటా యన్నారు. 40దేశాలనుంచి 400మంది కళాకారులతో ప్రత్యేక సంగీత కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. భగవాన్ శ్రీసత్య సాయిబాబా శతజయంతి ఉత్సవాలతో సంస్కృతిక మహోత్సవం ముగుస్తుందన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయపతాకం రెపరెపలాడాలి



జాతీయ పతాకాలతో జాగృతి ఇలా...



విద్యార్థులతో ఐటీబీపీ బృందం

విజయపుర, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ప్రతి ఇంటిపై జాతీయపతాకం రెపరెపలాడాలని ఇండో టిబెటియన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) బెంగళూరు విభాగం డీఐజీ అన్వర్ ఇలాహి అభిప్రాయపడ్డారు. హర్‌ఘర్ తిరంగా పేరిట జాగృతి ర్యాలీ నిర్వహించారు. దేశభక్తిని పెంపొందించడమే కార్యక్రమ లక్ష్యమన్నారు. భారత్‌మాతాకీజై అంటూ నినాదాలు చేస్తూ చుట్టుపక్కల గ్రామాలలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీబీపీ పోలీస్ అసిస్టెంట్ కమాండెంట్‌లు పీవీ సంతోష్, సిద్దార్థ త్రిపాఠి, అసిస్టెంట్ కమాండెంట్ షబ్నమ్, సీఎంఓ అజ్‌కుమార్ ఫజాన్ తదితరులు పాల్గొన్నారు. ర్యాలీలలో పలు చోట్ల విద్యార్థులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు.

జాతీయ వీల్‌చెయిర్ టెన్నిస్ పోటీల్లో రాణించిన కర్ణాటక జట్టు



షీల్డులతో జట్టు బృందం

బెంగళూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి వీల్‌చెయిర్ టెన్నిస్ పోటీలలో కర్ణాటక జట్టు తన ప్రతిభను చాటింది. ఇటీవల చెన్నైలో పోటీలు జరిగాయి. 9చాంపియన్‌షిప్ పురస్కారాలలో ఆరింటిని దక్కించుకుని జాతీయ వీల్‌చెయిర్ పోటీలలో మరోసారి సత్తా చాటింది. పురుషుల సింగిల్స్, డబుల్స్‌లో శేఖర్ చాంపియన్ కాగా, మహిళల సింగిల్స్, డబుల్స్‌లోనూ ప్రతిమారావు ఫైనల్స్‌కు చేరుకుని రెండింటిలోనూ రన్నరప్‌గా నిలిచారు. టోర్నీకి సంబంధించి కర్ణాటక వీల్‌చెయిర్ టెన్నిస్ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ మాట్లాడుతూ బల్డోటా గ్రూప్ నిరంతరంగా సహకరించి క్రీడాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. కర్ణాటకజట్టు అద్భుత ప్రదర్శన సాధించిందన్నారు.

తాలూకాలో ద్రౌపదీదేవి జయంతి ఆచరణకు నిర్ణయం



వహ్నికుల క్షత్రియసంఘం తాలూకా పదాధికారులు

బంగారపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తాలూకా వహ్నికుల క్షత్రియసంఘం పదాధికారులు చక్కటి ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని వారి కార్యవైఖరి ప్రశంసనీయమని సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్ఏ మంజునాథ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ధర్మరాయ స్వామి దేవస్థానంలో వహ్నికుల క్షత్రియసంఘం ఆధ్వర్యంలో ద్రౌపదీదేవి జయంతిని పురస్కరించుకుని విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలు తమ ఆరాధ్య దేవతల జయంతిని ఆచరిస్తారన్నారు. ఇందులో భాగంగా తమ సముదాయ సంఘం ఐకమత్యం చాటేందుకు జిల్లాలోని అన్ని తాలూకాలోని ద్రౌపదీదేవి జయంతి ఆచరించేలా ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామన్నారు. పట్టణంలో దశాబ్దాలక్రితం సముదాయభవనం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని అయినా ఇంత వరకు పూర్తి కాలేదన్నారు. కోలారు జిల్లా వహ్ని కుల తిగళ సమన్వయ సమితి గౌరవాధ్యక్షుడు పల్లవి మణి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ఆరాధ్యదైవాల జయంతి ఆచరణకు ఆమోదం తెలిపిందన్నారు. తద్వారా రానున్నరోజుల్లో ద్రౌపదీ దేవి అమ్మవారి జయంతి ప్రభుత్వ కార్యక్రమంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జయరాం, కుమార్, సంఘం తాలూకా అధ్యక్షుడు సీ రామమూర్తి, శ్రీనివాస్, కనకరాజు, కేసీ గోపాల్, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒకేరోజు రెండు ఆలయాల్లో చోరీ

దొమ్మసంద్ర, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళి ఒళగేరి కల్లహళ్ళిలో ఒకేరోజు రెండు ఆలయాల్లో చోరీ జరిగింది. ఆదివారం అర్ధరాత్రి రెండు ఆలయాలలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. చౌడేశ్వరి దేవస్థానం, మునేశ్వర దేవస్థానాలలో ఒక వెండి దీపం సుమారు రూ.1.10లక్షలు, మాంగల్యం సుమారు 70వేల రూపాయలు, బంగారు గొలుసు రూ.2.50లక్షలు, హుండీలో సుమారు రూ.25వేలు చోరీకి గురైనట్టు తెలుస్తోంది. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నలుగురు వ్యక్తులు చోరీచేశారని, అందులో ఒకడు హెల్మెట్ ధరించగా, ముగ్గురులు మాస్క్ వేసుకున్నారు. గడ్డపార చేతబట్టుకుని సంచరించినట్టు గుర్తించారు. రెండు ఆలయాలకు మధ్య కిలోమీటరు దూరం ఉంది. రోడ్డు, తోట మార్గం ద్వారా వెళ్లి చోరీకి పాల్పడ్డారు. దేవుడికి సమర్పించిన నైవేద్యాన్ని కూడా తీసుకెళ్లి తోటలో తిని మిగిలినది అక్కడే పడేశారు. ఘటనపై చౌడేశ్వరి దేవస్థాన ట్రస్టు అధ్యక్షుడు, ఆనేకల్ తాలూకా బీజేపీ మాజీ అధ్యక్షుడు శివప్ప మాట్లాడుతూ ఇటీవల చోరీలు పెరిగాయన్నారు. పోలీసు బీట్ పెరగాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామస్థుడు మంజునాథ్ మాట్లాడుతూ పట్టపగలే వరమహాలక్ష్మి పండుగ రోజున ఒక మహిళ మెడలోని బంగారుగొలుసును దుండగులు లాక్కుని పరారయ్యారన్నారు. ఒంటరిగా ఉన్న వారిని గుర్తించి చోరీకి పాల్పడుతున్నారన్నారు. గంజాయి వ్యసనపరులు చోరీలకు పాల్పడుతున్నారనే విమర్శలు వ్యక్తమయ్యాయి. గ్రామస్థుల డిమాండ్ మేరకు పోలీసులు, డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్ ఆలయాలను పరిశీలించారు.



చౌడేశ్వరి ఆలయంలో డాగ్‌స్క్వాడ్ పరిశీలన



మునేశ్వర ఆలయంలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

16న కృష్ణాష్టమి పోటీలు

బెంగళూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ మహిళా విభాగం, భారతీ సత్సంగం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్టు సభ్యురాలు శైలజా తెలిపారు. ఈనెల 16న మారతహళ్ళి మున్నేకొళ్లాలలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. చిన్నారులకు రాధాకృష్ణ వేషధారణలతో పాల్గొనవచ్చునన్నారు. సాయంత్రం 5 గంటలకు పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు 9611119066 కు సంప్రదించాలన్నారు.

77 ఏళ్ల వృద్ధుడికి విజయవంతంగా కిడ్నీ అమరిక

బెంగళూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వయసు పైబడితే సర్జరీలు కష్టమనే అభిప్రాయాలు ఉన్నాయి. అయితే ట్రస్ట్‌వెల్ ఆసుపత్రిలో 77ఏళ్ల వ్యక్తికి కిడ్నీని విజయవంతంగా అమర్చారు. గతవారం 73ఏళ్ల వ్యక్తి మృతి చెందడంతో అతడి కిడ్నీని 77ఏళ్ల వృద్ధుడికి అమర్చారు. 70ఏళ్లు పైబడిన వారికి అవయవదానం చేయాలంటే దేశంలోనే అవయవాల అమరిక చాలా అరుదుగా సాగుతాయి. కిడ్నీ అమర్చిన తర్వాత కొన్నిరోజులపాటు అతడికి ఐసీయూలో చికిత్సలో అందించామన్నారు. ప్రస్తుతం అతను సంపూర్ణంగా కోలుకున్నారన్నారు. ట్రస్ట్‌వెల్ ఆసుపత్రిలో సవాళ్లు అనిపించే వైద్యసేవలను సాధ్యం చేసే నిపుణులైన వైద్యబృందం వల్ల సాధ్యమైందని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

అరుదైన శస్త్రచికిత్స

బెంగళూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కోల్కత్తాకు చెందిన 23ఏళ్ల దేబ్ రంజన్ అనే యువకుడు బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చేయితోపాటు భుజం సంపూర్ణంగా స్వాధీనం కోల్పోయారు. సదరు యువకుడికి మెడికవర్ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్సను విజయవంతం చేసినట్టు ప్లాస్టిక్ సర్జరీ నిపుణుడు సురేశ్ తెలిపారు. డాక్టర్ తెలిపిన మేరకు వాహన ప్రమాదానికి గురైనప్పుడు చేయి, భుజంతోపాటు మెడకు సంబంధించిన నరాలు దెబ్బతిన్నాయన్నారు. ఆర్థోపెడిక్ సర్జన్ కృష్ణకుమార్‌తో కలసి ఆపరేషన్ చేశామన్నారు. ప్రస్తుతం దేబ్‌రంజన్ సంపూర్ణంగా కోలుకున్నట్టు తెలిపారు.

ఇంటీరియర్ డెకరేషన్‌పై ఆసక్తి

బెంగళూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలు గృహాలకు సంబంధించి ఆధునాతన శైలిలో భాగంగా ఇంటీరియర్ డెకరేషన్ పట్ల ఆసక్తి చూపుతున్నారని హెట్టిచ్‌సంస్థ డైరెక్టర్ ఆంధ్ర్యూ ఎక్‌హోల్ట్ అభిప్రాయపడ్డారు. శివాజీనగర్‌లో సంస్థ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునాతన వస్తువులకు ఏఐ టచ్ సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్నాయన్నారు. ప్రజల ఆసక్తికి అనుగుణంగా గృహాలంకరణ పరికరాలు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

తెలుగు యువత జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి

పరిగి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలుగు యువత జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి సూచించారు. బుధవారం సేవామందిరం లింగన్న పాఠశాలకు 2, గలిబిపల్లి పాఠశాలకు 1, కొడిగెనహళ్లి సచివాలయానికి 1, పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఒకటి చొప్పున కంప్యూటర్లను వితరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ. లక్ష 87 వేలతో కంప్యూటర్లను ఇవ్వడం జరిగిందన్నారు. తన వంతు సాయానికి ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ, మహేశ్వర్‌రావు, జూలారెడ్డి, నారాయణరెడ్డి, రామాంజి, శివ, అక్కులప్ప తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పిన చంద్రబాబు: ఉష శ్రీచరణ్

సోమందేపల్లి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన మాటను తప్పారని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బ్రహ్మసముద్రం, చల్లాపల్లి, నాగినాయనిచెరువు, నడింపల్లి గ్రామాల్లో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోను ఆవిష్కరించారు. అనంతరం బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలు అమలులో విఫలమయ్యారన్నారు. మహాశక్తి పథకం నిరుద్యోగభృతి తదితర పథకాలు అటకెక్కాయన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొదటి విడతలో 167 సీట్లు భర్తీ

రొళ్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): దొమ్మరహట్టి వద్ద ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో తరగతుల వారీగా ఖాళీ సీట్లకు డీసీఓ జయలక్ష్మీ ఆధ్వర్యంలో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మొదటి విడత కౌన్సిలింగ్‌లో 167సీట్లు భర్తీ అయ్యాయని డీసీఓ తెలిపారు. కౌన్సెలింగ్‌లో ప్రిన్సిపాల్ షైలారప్ప, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుమ జగన్నాథ్ పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు

హిందూపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో ముందుగానే శ్రీ కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కృష్ణుడు, రాధిక వేషధారణలో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు శ్రీనివాసులు శ్రీకృష్ణ లీలలను వివరించారు. ఆయన బోధించిన భగవద్గీత విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గాయిత్రి, ఏఓ భాస్కర్, విజయేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీతోనే వాల్మీకులకు న్యాయం

చిలమత్తూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వాల్మీకులకు టీడీపీతోనే న్యాయం జరుగుతుందని ఆ కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని సోమఘట్ట గ్రామంలో పర్యటించి వాల్మీకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వాల్మీకులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం నుంచి వారికి అందాల్సిన పథకాలు తదితరవాటిపై చర్చించారు. టీడీపీతోనే వాల్మీకులకు అన్ని రకాలుగా న్యాయం జరుగుతోందన్నారు. వాల్మీకులకు రాజకీయంగా, సామాజికంగా సముచిత స్థానం కల్పిస్తూ వాల్మీకులను గౌరవిస్తోందన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి సత్వరమే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగప్ప, నాగేంద్ర, సదాశివ, అంజి, శివప్ప, రామాంజి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

చిలమత్తూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడికొండ చెక్‌పోస్టులో ఉన్న సమర్థన దివ్యాంగుల ట్రస్టులో ఉంటున్న విద్యార్థులకు టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణయాదవ్ రూ. 10 వేల విలువచేసే దుప్పట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా వీధిలైట్లు లేక ఇబ్బంది పడుతున్న తుమ్మలకుంట గ్రామానికి రూ. 6 వేలు విలువ చేసే వీధిలైట్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1629.26
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	19,603	35,425
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	19,499	1,09,526
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	91.31

జోరుగా జాతీయ జెండాల విక్రయం



జెండాలను విక్రయిస్తున్న దృశ్యం

బళ్లారి సిటీ,ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య వేడుకలకు అనుగుణంగా నగరంలోని అనేక ప్రాంతాలలో జాతీయ జెండాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నగరంలోని గడిగిచెన్నప్ప, గవియప్ప సర్కిల్, ప్రధాన సర్కిళ్లలో రూ.50 నుంచి రూ.250 వరకు విక్ర యిస్తున్నా రు. ఖాదీ భాండార్ దుకాణంలో నిర్దిష్ట పరిమాణాలలో ఖాదీతో తయారు చేసిన జెండాలు అందుబాటులో ఉన్నాయి.

జెండాల పంపిణీ



జాతీయ జెండాలు అందజేస్తున్న బీజేపీ నాయకులు

బళ్లారి సిటీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హర్ ఘర్ తిరంగా యాత్ర ప్రచారంలో బీజేపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి జాతీ జెండాలను పంపిణీ చేశారు. 15వ తేదీన ఇంటిపై జాతీయజెండాను ఎగురవేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లాధ్యక్షుడు సునీల్ నాయుడు, అధికార ప్రతినిధి ప్రమోద్, సుందర్, శంకరప్ప, మల్లేశ్ పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు



కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న రాఘవేంద్రరావు

బళ్లారి సిటీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు బుధవారం రాయలకాలనీ సంజీవరాయుడి మఠంలో ఘనంగా ముగిశాయి. బృందావనానికి పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భజన మండలి సభ్యులు తుంగ-గంగా కళాకారులు ప్రదర్శించిన కోలాట నృత్యం, భక్తిగీతాలు అలరించాయి. కళాకారులందరికి మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక పండితులు గురురాజరావు, శ్రీధరరావు, ప్రముఖులు సత్యనారాయణ, జడ్పీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆశా కార్యకర్తల నిరసన



నిరసనలో పాల్గొన్న ఆశా కార్యకర్తలు

బళ్లారి సిటీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర యూనైటెడ్ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తల నిరసన రెండో రోజు బుధవారం కొనసాగింది. గౌరవ వేతనాన్ని కనీసం రూ.10,000లకు పెంచాలని, కేంద్రం నుంచి పాక్షిక ప్రోత్సాహకం కూడా పెంచాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అంగన్‌వాడీ, హాట్ మీల్ వర్కర్లకు రూ.10000 ప్రోత్సాహకాన్ని పెంచినట్లే అన్ని ఆశా వర్కర్లకు పెంచాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు. నిరసనలో శాంత, దేవదాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన ఇల్లు



కూలిపోయిన ఇంటి వద్ద బాధితులు

తోరణగల్లు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఇళ్లు దెబ్బతింటున్నాయి. సండూరు తాలుకా కోడలి గ్రామంలోని లక్ష్మీ, తిప్పన్న నివసిస్తున్న ఇల్లు ఇటీవల కురిసిన వర్షాలకు కూలిందని అధికారులు తెలిపారు. పట్టణంలో 7.6 మి.మీ, విఠలాపురంలో 2.8, కురేకుప్పలో 11, చోర్నూరులో 6.0 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కుడితినిని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: ఎంపీ

కంప్లి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని కుడితిని పట్టణాన్ని మాదిరి పట్టణంగా తీర్చిదిద్దుతానని ఎంపీ ఈ తుకారాం అన్నారు. బుధవారం కుడితిని పట్టణంలో రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఎంపీ మాట్లాడుతూ ఇప్పటికే రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టామని, మిగిలిన రోడ్డు పనులు కూడా రూ.7 కోట్లతో భూమిపూజ చేశామన్నారు. పేద ప్రజలకు అనుగుణంగానే ఇందిరా క్యాంటీన్ ప్రారంభించామన్నారు. ప్రతి ఒక్కరు ఇందిరా క్యాంటీన్ సదుపాయం సద్వినియోగం చేసుకోవాలన్నారు. నూతన హాస్టల్‌ని కూడా ప్రారంభించారు. అనంతరం గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. జిల్లాలో కొత్తగా నవోదయ వసతి పాఠశాల ప్రారంభమవుతుందన్నారు. త్వరలోనే కుడితిని, కురుగోడు రైల్వే ట్రాక్‌పైన ఫ్లైఓవర్ పనులు కూడా పూర్తి అవుతాయన్నారు. రైతులు సమస్యల కూడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో వంద పడకల ఆస్పత్రిని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతిఒక్కరు అభివృద్ధికి ముందుకొచ్చినప్పుడే గ్రామాలు గానీ, పట్టణాలు గానీ పూర్తిగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నపూర్ణ పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు సుజాత, సత్యప్ప స్థాయి సమితి అధ్యక్షులు రాజశేఖర్, ఉపాధ్యక్షులు కనికేరి



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీ తుకారాం, ఎమ్మెల్యే

పంపాపతి ముఖ్య అధికారి తీర్థప్రసాద్, కౌన్సిలర్లు, ప్రముఖులు కేఎస్ఆర్ స్వామి పల్లెద ప్రభు, వీకేసీ చంద్రప్ప, అంజి, దొడ్డప్ప, సత్యప్ప, చంద్రయ్య, దొడ్డ బసప్ప, సొసైటీ ప్రెసిడెంట్ యర్రిస్వామి, ఆనంద్, గంగాధర్, శారద, నళిని, యాస్మిన్ పట్టణ పంచాయతీ సిబ్బంది పట్టణ వాసులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరా క్యాంటీన్లు ప్రారంభం

తోరణగల్లు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తోరణగల్లు స్టేషన్, కుడితిని పట్టణంలో ఇందిరా క్యాంటీన్లు సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది ఒక మంచి కార్యక్రమమన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య కల అని ఈ ప్రాంతంలో పనిచేసే కార్మికులు ఎక్కువని, ఏ కార్మికుడు ఇబ్బందిపడరాదని



ప్రజలతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం

క్యాంటీన్‌ను ప్రారంభించామన్నారు. మహిళలకు ఆర్థిక భద్రత కోసం వారికి పనులు కల్పించే ఉద్దేశంతో మంచి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. స్థానిక బసవేశ్వర గ్రామాంతర పాఠశాలలో జేఎస్‌డబ్ల్యూ నిర్మించిన రెండు శౌచాలయాలను ఆమె ప్రారంభించారు. తహసీల్దార్ అనిల్ కుమార్, అధికారులు మడిగిన బసప్ప, శిక్షణ అధికారి అక్కి, ఎమ్మెల్సీ కేఎస్ఎల్ స్వామి, పురసభ అధ్యక్షుడు కల్లుడప్ప, ఉపాధ్యక్షురాలు జేడీఎస్ తాలుకా అధ్యక్షులు సోమప్ప, పురసభ అధ్యక్షులు సతీష్ గుడ్డే పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

కంప్లి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని ఎమ్మిగనూరు గ్రామంలో ఎరువుల దుకాణాల్లో ఎమ్మార్పీ కన్నా ఎక్కువగా అమ్ముతున్న ఎరువుల దుకాణాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పట్టణంలో రైతు సంఘం నాయకులు కోడెల చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బీవీ గౌడ, తాలుకా అధ్యక్షుడు వీరేష్ మాట్లాడుతూ ఎమ్మిగనూరులోని ఎరువుల దుకాణాల్లో మార్కెట్లో కన్నా ఎక్కువ ధరకు అమ్ముతున్నారని వాపోయారు. వీటితో పాటు నకిలీ మందులతో రైతులను మోసం చేస్తున్నారన్నారు. రైతులతో ఖాళీ చెక్కు, బాండ్ పేపర్లో రాయించుకుని అధిక రేట్లకు అమ్ముతున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మంజునాథరెడ్డికి, పోలీసుశాఖ అధికారులకు వినతిపత్రం అందించారు. పోలీసు అధికారి మంజునాథరెడ్డి మాట్లాడుతూ దుకాణాల్లో ఎక్కువ రేట్లకి అమ్ముతున్నాని, ఆ దుకాణాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాలుకా ఉపాధ్యక్షులు ఈరన్న, అడివయ్యస్వామి జడియప్ప,



అధికారి మంజునాథరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

బజారు వెంకటేష్, సుమంత్ స్వామి, తిమ్మయ్య, తిమ్మప్ప నాయక్, కొట్టూరు రమేష్, మురారి, సీఐ విశ్వనాథ్, హిరేగౌడ, ఎస్ఐ సుప్రీత్, విరుపాక్షప్ప పాల్గొన్నారు.

ఏటీఎం దొంగ అరెస్టు

బళ్లారిరూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని బ్రూస్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో కాలమ్మ సర్కిల్‌లో ఏటీఎం కేంద్రంలోకి ఓ దొంగ చొరబడి ఏటీఎం యంత్రాన్ని ధ్వంసం చేస్తుండగా గుర్తించిన ఏఎస్ఐ మల్లికార్జున చాకచక్యంగా అతనిని పట్టుకున్నాడు. ఇందుకు రంబంధించి పోలీసులు తెలిపిన మేరకు ఇలా ఉన్నాయి... ఏఎస్ఐ రాత్రి గస్తీ తిరుగుతుండగా కాలమ్మ సర్కిల్ వద్దనున్న ఏటీఎంలో దొంగ చొరబడి యంత్రాన్ని పగులగొడుతున్న



ఏఎస్‌ఐని సన్మానిస్తున్న ఎస్పీ శోభారాణి



దొంగను పట్టుకున్న ఏఎస్ఐ మల్లికార్జున.. సీసీటీవీలో రికార్డైన దృశ్యం

దృశ్యాలను సీసీ టీవీ ఆధారంగా ఏఎస్ఐ దృష్టికి వచ్చింది. వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఏటీఎం దగ్గరికి వెళ్లిన ఏఎస్ఐని చూసి దొంగ తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. ఏఎస్ఐ అతనిని పట్టుకునేందుకు ప్రయత్నించాడు. పోలీసును చూసిన దొంగ ఏటీఎం బయటకు వచ్చి ఏఎస్ఐపై దాడి చేసేందుకు ప్రయత్నించి తప్పించుకోబోయాడు. వెంటనే అక్కడికి వచ్చిన మరో ఇద్దరు పోలీసులు అతనిని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకుచ్చారు. దొంగ అనంతపురం జిల్లాకు చెందిన వెంకటేశ్‌గా గుర్తించారు. ఏటీఎం దొంగను పట్టుకున్న ఏఎస్ఐ, పోలీసులను ఎస్పీ డాక్టర్ శోభారాణి అభినందించి సన్మానించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పెనుకొండ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ సుదర్శన్ తెలిపారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్, సైబర్ క్రైం, ఇంటర్నెట్, మొబైల్ సోషల్ మీడియా ద్వారా జరిగే నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బేబి, మూర్తి, జనార్దన్, ఎన్ఎస్ఎస్ పీఓలు శివన్న, రవికుమార్, శ్రీలేఖ పాల్గొన్నారు.

● గోరంట్ల: మండలంలోని విశ్వవిద్యాలయం, అన్నికళాశాలలోనూ మత్తు పదార్థాలకు బానిసలుకాకుండా సీఐ శేఖర్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. కమ్మలవాండ్లపల్లి వద్ద బెస్టూయూనివర్సిటీ, గోరంట్లలోని ఎస్ఎపిఎస్, ఎస్కేడి జూనియర్, ఎస్‌పివిఎం, ఎఎన్‌కె డిగ్రీకళాశాలలో పోలీసులు విద్యార్థులతో విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. గుట్కా, పాన్‌పరాగ్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. కార్యక్రమాల్లో అసిస్టెంట్ రిజిస్ట్రార్ జయప్రకాష్, ప్రిన్సిపాళ్ల



గోరంట్లలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

భక్తవత్సలం, విజయలక్ష్మీ, కెంపుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

● గుడిబండ: విద్యార్థినులు చక్కగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఎస్ఐ రాజకుల్లాయప్ప పేర్కొన్నారు. బుధవారం గుడిబండ మహాత్మ జ్యోతిరావుపూలే కళాశాలలో చదువుతున్న విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నేటి యువతరం మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.

ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించండి

సిరుగుప్ప, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వైద్యులు ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాలని ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి రమేష్‌బాబు సూచించారు. బుధవారం పట్టణ గురుభవనంలో వైద్యుల పనితీరు, ప్రగతిపై పరిశీలన సమావేశం నిర్వహించారు. తాలుకావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాస్పత్రుల రికార్డులను పరిశీలించారు. ప్రజలకు సంక్షిప్త విషయాలను తెలియపరిచేందుకు వైద్యుల సమావేశం నిర్వహించారు. డెంగీ, చర్మ రోగాలు ఆర్థోపెడిక్, వివిధ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తాలుకా ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ దమ్మూరు బసవరాజు, ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి వివేకానంద, గ్రామస్థాయి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈడీ సోదాలు



హొస్పేట్‌లో నాగరాజు ఇంటి వద్ద ఈడీ అధికారుల వాహనాలు

బళ్లారి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): బళ్లారి, విజయనగర, ఇతర జిల్లాల్లో నుంచి గతంలో బెలెకెర పోర్టుకు అక్రమంగా ఇనుప ముడిఖనిజం తరలించారనే కేసుపై బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దాడులు నిర్వహించింది. విజయనగర(హొస్పేట్) కారంపుడి మహేష్, స్వస్తిక్ నాగరాజ్ అనే వ్యక్తుల ఇళ్లపై దాడులు చేశారు. వారివురి ఇళ్లు, దుకాణాలు, కార్యాలయాల్లో ఈడీ సోదాలు చేసింది.

శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రం

● ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడు కరువు
● బాడుగ ఇంట్లో నిర్వహణ
● ఇబ్బంది పడుతున్న చిన్నారులు

కంప్లి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 18వ అంగన్‌వాడీ కేంద్రం కూలేందుకు సిద్ధంగా ఉంది. షుగర్ ఫ్యాక్టరీ కాళికాదేవి ఆలయం వెనుక భాగంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరుకుని కొన్నేళ్లవుతోంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు కేంద్రం గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. రేపో మాపో కూలటానికి సిద్దంగా వుండటంతో పిల్లల్ని దృష్టిలో వుంచుకుని అంగన్‌వాడీ టీచర్లు పక్కనే బాడుగకు ఒక బిల్డింగ్ తీసుకుని నడుపుతున్నారు. సంవత్సరాల పాటు గడుస్తున్న స్థానిక ప్రజా ప్రతినిధులు కేంద్రం అభివృద్ధిపై దృష్టిసారించలేకపోతున్నారు. ఇంకా ఎన్ని రోజులు బాడుగ గదిలో పిల్లలకు చదువు చెప్పాలోనని టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు ముందుకొచ్చి నియోజకవర్గంలో ఇలా శిథిలావస్థకు చేరుకున్న అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



కూలడానికి సిద్దంగా ఉన్న 18వ అంగన్‌వాడీ కేంద్రం

నా నిశ్శబ్దం.. విప్లవం అవుతుంది

● సమాధానం చెబుతా.. వడ్డీతో చెల్లిస్తా..!
● అనంతా.. ప్రజల గురించి ఆలోచించు..!
● మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి

అనంతపురం క్రైం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఎవరికైనా సమాధానం చెప్పే దమ్ము, ధైర్యం తనకు ఉన్నాయని, తాటాకు చప్పుళ్లకు భయపడనని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి అన్నారు. సాయినగర్‌లోని ఆసుపత్రి సమస్యపై సమగ్ర వివరాలు సేకరిస్తున్నానని, ఆ వివరాలతో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ను కలుస్తానని స్పష్టం చేశారు. అవే ద్వారా లీగల్‌గా కూడా వెళ్తానని అన్నారు. తన గురించి మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి లేనిపోనివి రాయిస్తున్నారని, ఆయన ప్రజల గురించి ఆలోచిస్తే బాగుంటుందని హితవు పలికారు. అందరి లెక్కలు తేలుస్తానని, వడ్డీతో సహా తిరిగి ఇస్తానని హెచ్చరించారు. రాంనగర్‌లోని తన నివాసంలో బుధవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. జగన్ పత్రికకు, కొందరు పాత్రికేయులకు అనంతపురంలో వైకుంఠం తప్ప ఎవరూ కనిపించడం లేదని విమర్శించారు. తాను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని కాదని, సామాన్య కార్యకర్తనని అన్నారు. తనకు మరొకరితో పోటీ అని జగన్ పత్రికలో రాశారని, తనకు ఎవరితోనూ పోటీ లేదని, తనతో తనకే పోటీ అని అన్నారు. మున్సిపల్ ఛైర్మన్‌గా, ఎమ్మెల్యేగా 72 ఎకరాల్లో శిల్పారామం, పార్కుల్లో జిమ్స్, కమ్యూనిటీ హాల్స్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, చెరువుకట్టపై రోడ్డు, పార్కు ఏర్పాటు చేశానని, అయినా తన హయాంలో అభివృద్ధి కుంటుపడిందని రాయడం ఏమిటని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సూర్యానగర్ రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్, హౌసింగ్‌బోర్డు రోడ్లు వేయించామని అన్నారు. చీకటి మిత్రుడు అని మరొకరు రాశారని, తనకు ఫుల్ బాటిల్ కొట్టే అలవాటు లేదని, కార్డ్స్ ఆడేది లేదని అన్నారు. గత ప్రభుత్వంలో జరిమానాలు వేయడంతో గ్రానైట్ క్వారీలు, క్రషర్లు మూసేసుకుని, ఆస్తులు అమ్ముకుని పార్టీ కోసం పనిచేశామని అన్నారు. చంద్రబాబును అరెస్టు చేస్తే పార్టీ చేసుకున్నవారు, ఐదేళ్లపాటు స్పందించని నాయకులు ఇప్పుడు తనపై జిల్లా కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్నారని, సస్పెండ్ చేయిస్తారేమో చేయించాలని సవాలు విసిరారు. మరొక ఊరి నుంచి వలస వచ్చిన నాయకుడిపై ఆ ప్రాంతంలో అనే కేసులు ఉన్నాయని, ఆయన కూడా ఇప్పుడు మాట్లాడుతున్నారని విమర్శించారు. అవే సంస్థను పెట్టిందే దౌర్జన్యాలను అడ్డుకోడానికని, గతంలో రాష్ట్రం అంతటా తిరిగి ఫ్యాక్షనిజానికి వ్యతిరేకంగా పోరాటం చేశామని అన్నారు. తన సహనాన్ని చేతగాని తనంగా తీసుకోవద్దని హెచ్చరించారు.

జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ

హిందూపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): హర్‌ఘర్ తిరంగ ర్యాలీలో భాగంగా బుధవారం జాతీయజెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలతో జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ సిబ్బంది స్వయం సహాయక సంఘాల ఆర్పీలు, ఓబీలతో కలిసి మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్ ఛైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున ప్రారంభించారు. పట్టణంలోని వీధులగుండా బైక్‌ర్యాలీ సాగింది. కార్యక్రమంలో మెప్మా అధికారులు గంగులయ్య, కిష్టప్ప, పట్టణ సమైక్య లీడర్లు సరస్వతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

● పరిగి: పరిగిలోని సేవామందిరం ఎన్‌లైట్ డిగ్రీ కళాశాల నుంచి కొడిగెనహళ్లి బస్టాండు సమీపం వరకు బీజేపీ నాయకుడు పరిగి వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల కన్వీనర్ ఎన్ఎల్ మూర్తి, శివ, చంద్రశేఖర్‌రెడ్డి ర్యాలీలో పాల్గొన్నారు.

● మడకశిర టౌన్: పట్టణంలో నగర పంచాయతీ ఛైర్మన్ నరసింహరాజు ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని బుధవారం చేపట్టారు. జాతీయ జెండాల చేతపట్టుకుని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జోనల్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు పురుషోత్తం, మడకశిర సింగల్ విండో అధ్యక్షులు నరేష్‌కన్నా, టీడీపీ పట్టణ అధ్యక్షులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● పెనుకొండ: నగర పంచాయతీ ఆధ్వర్యంలో పెనుకొండలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్, సిబ్బంది, రెవెన్యూసిబ్బంది, సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

614 కిలోల గుట్కా స్వాధీనం

హోసూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తనిఖీలలో రెండు వేర్వేరు చోట్ల హోసూరు నుంచి అక్రమంగా తరలిస్తున్న 614 కిలోల గుట్కాను, వాటిని తరలించేందుకు ఉపయోగించిన రెండు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక కారు డ్రైవర్‌ను అరెస్టు చేయగా మరో డ్రైవర్ కోసం గాలింపులు చేపట్టారు. ప్యారండపల్లిలో కొత్త ఫ్లై ఓవర్ నిర్మాణ స్థలంలో హోసూరు ఏటీసీ పోలీసులు తనిఖీలు చేస్తున్న వేళ బెంగళూరు నుంచి వచ్చిన ఒక కారును పరిశీలించారు. అందులో 344 కిలోల గుట్కా దీని విలువ రూ.4.16లక్షలు, ఇంకా 20 మద్యం ప్యాకెట్లు ఉన్నాయి. కారు డ్రైవర్ పరారయ్యాడు. జూజువాడి సమీపంలో సిప్‌కాట్ పోలీసులు తనిఖీలు చేయగా 270 కిలోల గుట్కా ఉంది. దీని విలువ రూ.2.34 లక్షలు. ఇంకా 22 కర్ణాటక మద్యం ప్యాకెట్లు ఉన్నాయి. కారును, గుట్కాను, మద్యాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అరెస్టు చేశారు. ఇతను మణికంఠన్ (37)గా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



కారులో పట్టుబడిన గుట్కా

అవయవదానంపై జాగృతి

హోసూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని హోసూరులో బుధవారం కావేరి ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక జాగృతి కార్యక్రమం జరిగింది. రామనాయకన సరస్సు వద్ద మానవ హారం నిర్మించారు. మేయర్ సత్య లాంఛనంగా ప్రారంభించి అవయవదానంపై ప్రతిజ్ఞ చేసి హామీపత్రంపై సంతకం చేశారు. 700మందికిపైగా వైద్యసిబ్బంది, పోలీసులు, సామాజిక కార్యకర్తలు, పాఠశాల విద్యార్థులు, ప్రైవేట్ కంపెనీ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేశ్‌కుమార్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొని దాతల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందచేసి అభినందించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న మేయర్ సత్య తదితరులు

సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు

హోసూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సరిహద్దు ప్రాంతాలలో తనిఖీలు ముమ్మరం చేశారు. చెక్‌పోస్టులలో గస్తీ పెంచారు. కృష్ణగిరి జిల్లా ఎస్పీ తంగదురై ఆదేశాలతో ఎస్పీ అనిల్ అక్షయ్ వాఖరె పర్యవేక్షణలో తనిఖీలు కొనసాగుతున్నాయి. జూజువాడి, కక్కనూరు, సంభంగిరి, పెరిగ్గె, తళి, కుంభలపురం, అంచెట్టి తదితర చెక్‌పోస్టులలో తనిఖీలు చేస్తున్నారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాకే తమిళనాడులోకి అనుమతిస్తున్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు